

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నగర కార్యదర్శి రాజ్‌దీప్

బాపూజీనగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తాం

ముషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లో త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామని ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసి బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ... ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు బడ్జెట్ కేటాయించిందన్నారు. బస్తీలో త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ప్రధానకార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు రమేష్‌గౌడ్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



జార్జిరెడ్డి వర్ధంతి సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నేతలు మహేష్, నాగరాజు తదితరులు

నేటి నుంచి 14 వరకు జార్జిరెడ్డి వర్ధంతి సభలు

నల్లకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో నాడు ఓ వైపు ర్యాగింగ్ పేరుతో గ్రామీణపేద విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారిని విద్యకు దూరం చేస్తున్న పరిస్థితుల్లో వ్యతిరేకంగా పోరాటం చేసిన ఓయూ ధ్రువతార కామ్రేడ్ జార్జిరెడ్డి అని పీడీఎస్‌యూ నేతలు కొనియాడారు. బుధవారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో కామ్రేడ్ జార్జిరెడ్డి అమరత్వాన్ని స్మరించుకుంటూ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు వర్ధంతి సభలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, కె.శ్రీనివాసులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం గౌతమ్, ఆసిఫ్, శ్యామ్, ఝాన్సీ, మాధవ్ పాల్గొన్నారు.

నేడు కానూరు వెంకటేశ్వరరావు సంస్మరణ సభ

నల్లకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అణగారిన ప్రజల పక్షాన తన కలాన్ని, గళాన్ని ఎక్కుపెట్టిన అరుణోదయ్య వ్యవస్థాపకుడు కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు అని ఆ సంస్థ నగర అధ్యక్షురాలు కోలా స్వప్న తెలిపారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని నినదించిన కానూరు అని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా గురువారం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది'

నల్లకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ధరను రూ.50, డీజిల్, పెట్రోల్ ధరలను రూ.2 చొప్పున పెంచి ప్రజలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జీఎస్టీ పేరుతో ప్రజల జేబులు గుల్ల చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ధరల పెరుగుదలతో మరోవైపు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. నిరుద్యోగం, అసంఘటిత రంగం, మధ్యతరగతి, రైతాంగం మోదీ పాలనలో బతుకు భారమై సతమతమవుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్ ధర తగ్గుతుంటే మన దేశంలో పెంచడం దుర్మార్గ చర్య అన్నారు. పెంచిన గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాగర్‌లాల్ రోడ్డు చదును.. తప్పిన ఇబ్బందులు

ముషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మూడు నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి దాయారం మార్కెట్ నుంచి సాగర్‌లాల్ ఆసుపత్రి చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించి మట్టితో రోడ్డును చదును చేశారు. ఇటీవల 1000 ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి కావడంతో ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. కనీసం ప్యాచ్‌వర్క్ పనులు కూడా చేపట్టకపోవడంతో పైప్‌లైన్ వేసినచోట రోడ్డు కుంగిపోయి ప్రమాదంగా మారింది. ప్రజల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి బుధవారం పనులు ప్రారంభించారు.



సాగర్‌లాల్ ఆస్పత్రి రోడ్డును చదును చేస్తున్న జలమండలి సిబ్బంది

మైనర్లు ద్విచక్రవాహనాలు నడపొద్దు : ట్రాఫిక్ సీఐ

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మైనర్లు ద్విచక్రవాహనాలను నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్ సీఐ ఎ.శ్రీనివాస్ హెచ్చరించారు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్‌ను కూడా రద్దు చేయిస్తామన్నారు. బుధవారం కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో మైనర్‌ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నింబోలిఅడ్డ వద్ద ద్విచక్రవాహనం నడుపుతున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మైనర్‌లకు ఎవ్వరూ కూడా వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనం నడిపిన మైనర్‌ను అదుపులోకి తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు

రైలుకింద పడి ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి జీవితంపై విరక్తి చెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... బౌద్ధనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్.బాబూరావు(64) ప్రైవేటు ఉద్యోగి. కొన్నినెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాడు. మందులు వాడినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో బుధవారం ఆర్ట్స్ కళాశాల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపారు.

మోదీ పాలనను విశ్వసిస్తున్న ప్రజలు

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్

ముషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ప్రజలు బీజేపీని విశ్వసిస్తూ దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్ పురి నందు ఆధ్వర్యంలో బీజేపీ జెండాలను బుధవారం ఆవిష్కరించారు. భరత్‌నగర్, శివాలయంచౌరస్తా ప్రాంతాల్లో సదానంద్ ముదిరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ, బీజేవైఎం నాయకులు అనిల్ కుమార్, అజయ్ గుప్తా, ఆయూష్, డివిజన్ నాయకులు మెట్టువాసు, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ భరత్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్ తదితరులు

బీజేపీ నాయకుల మధ్య ఫ్లెక్సీ రగడ

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ముషీరాబాద్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ ఆధ్వర్యంలో శివాలయం చౌరస్తా వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అదేచోట జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉండడంతో నాయకులంతా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కొంతమంది ఫ్లెక్సీబోర్డు చూసి అందులో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ఫొటో లేకపోవడం గుర్తించారు. ఈ విషయాన్ని ఆమె భర్త బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్ దృష్టికి డివిజన్ నాయకులు తీసుకెళ్లారు. దీంతో నవీన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటులో ప్రొటోకాల్ పాటించరా అని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా తాము ప్రతి కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడంతోపాటు కొత్త, పాత నేతలను సమావేశాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఫ్లెక్సీబోర్డులలో ఫొటోలు సైతం పెడుతున్నామని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఫ్లెక్సీలో కార్పొరేటర్ ఫొటో లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని బద్రినారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీజేపీ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఇదే క్రమంలో బద్రినారాయణను శివాలయం చౌరస్తా నుంచి బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు తీసుకెళ్లడంతో గొడవ సద్దుమనిగింది. ఇదిలా ఉంటే ఇరువురి నేతల మధ్య కొంత కాలంగా సఖ్యత లేకపోవడం వల్లే గొడవకు దారితీసిందని అక్కడున్న బీజేపీ నాయకులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న గోషాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్

పశువులకు దాణా, నీటి వసతి కల్పించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సందర్భంగా నీరు, పశుదాణా సరిగా లేక గోషాలాలలో పశువులు మరణిస్తున్నాయని ఆ మరణాలను ఆపడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పశుదాణా, నీటి వసతిని ఉచితంగా కల్పించాలని తెలంగాణ గోషాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్‌చేశారు. పశుసంరక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. మహావీర్ జయంతినిపురస్కరించుకుని జైన్‌సేవాసంఘ్, సహాయోధు సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ అడ్వకేట్ కీర్తి శేసులు సీపీ సారధి జ్ఞాపకార్థం బుధవారం సువర్ణ భారతి గోషాలను సందర్శించి పశువులకు పశుగ్రాసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత గోపాల కృష్ణ, ఫెడరేషన్ నాయకులు ప్రేమ్‌చంద్, మునోత్, భక్తరామ, నరహరి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

- వీఎస్టీ బస్టాండ్ వద్ద చలివేంద్రం ప్రారంభం



బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కో-కన్వీనర్ పి.శ్యామ్ వీఎస్టీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి బుధవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రం ప్రయాణికులకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



ఆలె నరేంద్రకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని తదితరులు

ప్రజలకు విశిష్ట సేవలందించిన నరేంద్ర

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ క్రియాశీలక కార్యకర్తగా, మాజీ కేంద్రమంత్రిగా ఆలె నరేంద్ర(టైగర్ నరేంద్ర) ప్రజలకు విశిష్ట సేవలు అందించారని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం నరేంద్ర వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితర పార్టీ శ్రేణులతో కలిసి ఆమె నరేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నరేంద్ర ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుంటూ ఆయన ఆశయాలసాధనకు ముందుకు సాగుతున్నామన్నారు. నరేంద్ర స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలకు ప్రజాభ్యున్నతికి కృషిచేయాలని కార్పొరేటర్ పావని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, శ్రీనివాస్‌యాదవ్, నీరజ్ పాల్గొన్నారు.



న్యూ అంబేద్కర్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, పీఎన్ చారి తదితరులు

బీజేపీని బలోపేతం చేయాలి : కార్పొరేటర్

కవాడిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరుపేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీఎన్ చారి ఆధ్వర్యంలో న్యూ అంబేడ్కర్ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను రచనశ్రీ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మానికి పీఎన్ చారి అధ్యక్షత వహించగా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న పలు పార్టీల నేతలు

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

రాంనగర్/కవాడిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పలు పార్టీల నాయకులు జైల్‌బరోను నిర్వహించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశాయి. బహుజన ముక్తిపార్టీ, బహుజన క్రాంతి మోర్చా, రాష్ట్రీయ పిచడా వర్గ్ మోర్చా, రాష్ట్రీయ పరివర్తన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసురామ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షులు అంసోలు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జైల్‌భరోను నిర్వహించారు. పోలీసులు వారిని అడ్డుకుని చిక్కడపల్లి పీఎస్‌కు తరలించారు. పోలీసుల అరెస్టును నిరసిస్తూ వారు పీఎస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, నాయకులు పాండునాయక్, శంకర్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, శివనాయక్; ఎండీ.ఫరీద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ పర్మనెంట్ ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదికి బుధవారం భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జి.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి షేక్ ఆస్రఫ్‌అలీ వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్ఎంసీ సర్కిల్-9లో ఏఎంహెచ్‌వోగా పనిచేస్తున్న జ్యోతిబాయిని పేరెంట్‌డిపార్ట్‌మెంట్‌కు పంపించాలన్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ సిబ్బందికి వైద్య సేవలు అందడం లేదన్నారు.

కేటీఆర్, ముఠా గోపాల్‌పై కేసు ముగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై నమోదైన ఎన్నికల కేసును నాంపల్లి కోర్టు ముగించింది. ఎన్నికల సందర్భంగా అనుమతి లేకుండా బాణాసంచా కాల్చారని ముషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు ఇటీవల క్వాష్ చేసింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో వారిపై విచారణలో ఉన్న కేసును ముగిస్తున్నట్లు నాంపల్లి కోర్టు ప్రకటించింది.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

- మరో కార్మికుడికి గాయాలు
- నష్టపరిహారం చెల్లించాలని బాధితుల ధర్నా

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి రిపేర్ పనుల కోసం వెళ్లి విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో కార్మికుడికి గాయాలయ్యాయి. ఇంటి యజమాని బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కుటుంబాల సభ్యులు, భవన నిర్మాణ సంఘం వారు కార్మికుడు మృతిచెందిన ఇంటి ఎదుట బుధవారం ధర్నాచేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భవన నిర్మాణ కార్మికులైన కనకాల చిన్నం నాయుడు(60), శ్రీనివాస్(50) రిసాలలో ఓ ఇంటి మరమ్మతులు చేయడానికి మంగళవారం వెళ్లారు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో చిన్నం నాయుడు అక్కడిక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. బాధితులకు న్యాయం చేయాలని ఇంటి యజమాని ముందు న్యూఅభయ సెంట్రింగ్ కన్‌స్ట్రక్షన్ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబంతో కలిసి బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి కె.నర్సింహ, ఫహీమ్, కోశాధికారి సదానందం, వారసీగూడ యూనియన్ నాయకుడు యాదగిరి మాట్లాడారు. ఇంటి యజమాని నిర్లక్ష్యం వల్లనే చిన్నంనాయుడు చనిపోగా మరో కార్మికుడు గాయాలయ్యాయని ఆరోపించారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షలు, గాయపడ్డ వ్యక్తి కుటుంబానికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.





యజమాని ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబాల వారు, భవన నిర్మాణ సంఘం కార్మికులు



బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

27న బీఆర్ఎస్ రజతోత్సవం

నల్లకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీశ్రేణులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవంలో భాగంగా ఈనెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. బుధవారం బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శివం రోడ్‌లోని హోటల్‌లో జరిగింది. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.

బీఆర్ఎస్ ఆవిర్భావం రోజు అంబర్‌పేట నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు గులాబీ కలర్ షర్ట్ ధరించి అన్ని కాలనీ, బస్తీల్లో పార్టీ జెండాలను ఎగురవేసి భారీ సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వి.రవీంద్రరావు, ఎం.భూపతినాథ్, కిషన్‌రావు, ఇర్ఫానా సుల్తానా, విజయేంద్రసాగర్, భాస్కర్‌గౌడ్, గోనె ప్రదీప్‌రావు, కూర నరేందర్, ఓంప్రకాష్‌యాదవ్, ఎర్రబోలు నర్సింహరెడ్డి, సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, భీష్మాదేవ్, రమణానాయుడు, అనిత, లావణ్య, వన్నాడి రమ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ అంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం కన్నులపండుగగా సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, దేవతాహ్వానం, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ప్రదోషకాల పూజ, అభిషేకాలు, పసువుల ముహూర్తం ఈవో దేవనాథం, పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ పర్యవేక్షణలో జరిగాయి.

నేటి నుంచి హనుమత్ విజయ ఉత్సవాలు

ఆర్టీసీ క్రాస్‌రోడ్ శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఈనెల 10 నుంచి 12 వరకు మూడురోజులపాటు హనుమత్ విజయ ఉత్సవాలు జరుగుతాయని ఈవో లక్ష్మారెడ్డి, పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు తెలిపారు.



బీజేపీ జెండాను ఆవిష్కరించిన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

బీజేపీకి ప్రజలను చేరువ చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రజలకు తెలియజేసి వారిని పార్టీకి మరింత చేరువచేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం జవహర్‌నగర్ స్కూల్ వద్ద జరిగిన బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె పార్టీ జెండాను ఎగురవేశారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, శివ, టి.కుమార్, శైలేష్, రహమత్‌అలీ, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్ సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్‌యాదవ్, దోనేటి సత్యం, రవియాదవ్, ప్రశాంత్ తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలతో అతిథులు

పురస్కారం గ్రహీతలకు ఆక్సిజన్‌లాంటిది

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించి ఇచ్చే పురస్కారాలు గ్రహీతలకు ఆక్సిజన్‌లా పనిచేస్తాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వచైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నివేదిత ఆర్ట్స్ సమర్పణలో బుధవారం త్యాగరాయ గానసభలో విశ్వావసు నామ సంవత్సర విశిష్ట సేవా ప్రతిభా పురస్కారాలను వంశీ సంస్థల అధ్యక్షులు వంశీరామరాజు, సంఘసేవకులు వడ్లకొండ వెంకట్రావుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ప్రముఖ గాయనీగాయకులు పి.సుభాష్, ఆమని పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో కుసుమ భోగరాజు, మద్దెల శివకుమార్, రాజన్, ఈశ్వర్‌రావు, తేజస్విని, శోభ, రోహిణి, శ్రీదేవి, శిరీష, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.సినారె సినీసంగీతోత్సవం కార్యక్రమం జరిగింది.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ తదితరులు

లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో లంబాడీలకు చోటుకల్పించకపోవడం అంటే లంబాడీలను విస్మరించడమేనని సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌నాయక్ ఆరోపించారు. రాష్ట్రం వ్యాప్తంగా లంబాడీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ లంబాడీల లడాయి పేరుతో రిలే నిరాహార దీక్ష, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, సేవాలాల్ బంజారా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చందులాల్‌నాయక్, గణేష్‌నాయక్, ఓయు జేఏసీ నాయకులు రవీంద్రనాయక్‌తోపాటు లంబాడీలు పాల్గొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

న్యూపటేల్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం డివిజన్‌లోని న్యూపటేల్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలు ఆయన తెలుసుకున్నారు. కచ్చామోరీ నాలా ప్రహరీ కూలిపోవడంతో దానికి వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కచ్చామోరీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.